సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 17 । మార్చి । 2024



నాటు తుపాకీలు అప్పగింత

మూడు నాటు తుపాకీలను స్వచ్ఛందంగా అందజేసిన గిరిజనులకు పోలీసులు నగదు ప్రోత్సాహకాలు అందజేసి అభినందించారు. 8లో



ఘనంగా తులసీదళార్చన

విశాఖ: నగరంలో బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.

రంజాన్ వేళలు

పాడేరు, అరకు
ఇఫ్తార్ (ఆది) 6.10 సహర్ (సోమ) 4.49
రంపచోడవరం
6.08 4.48



పాడేరులో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు



రంపచోడవరం అంబేద్కర్ సెంటర్‌లో సంబరాలు జరుపుకుంటూ నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



అరకులోయ అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగానికి అభినందనలు తెలుపుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీలో ఫుల్ జోష్



అరకులోయలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజరాణి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ శ్రేణులు

- అభ్యర్థుల ప్రకటనతో మిన్నంటిన సంబరాలు
- వాడవాడలా బాణసంచా కాల్పులు
- స్వీట్లు తినిపించి ఆనందం పంచుకున్న పార్టీ శ్రేణులు

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అరకు పార్లమెంట్, పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నెలకొంది. అరకు పార్లమెంట్ స్థానానికి డాక్టర్ గుమ్మా తనూజరాణి, రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, పాడేరు అసెంబ్లీ అభ్యర్థిగా మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు అసెంబ్లీ స్థానానికి రేగం మత్స్యలింగం పేరును ప్రకటించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. అభ్యర్థులకు పార్టీ శ్రేణులు, అభిమానులు అభినందనలు తెలిపారు. బాణసంచా కాల్చి సందడి చేశారు. పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఇంటి వద్ద కోలాహలం నెలకొంది. ఆయనను పలువురు అభినందించారు. పాత బస్టాండ్ వరకు విశ్వేశ్వరరాజు నేతలతో ర్యాలీగా వెళ్లి అక్కడ వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బాణసంచా కాల్చి వైఎస్సార్‌సీపీ నేతలంతా సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, జీకే వీధి, పాడేరు మండల పార్టీ అధ్యక్షులు బెబ్బులి లక్ష్మణ్, సీదరి రాంబాబు. పలు విభాగాల పార్టీ ప్రతినిధులు కూడా సురేష్‌కుమార్, కిల్లు కోటి బాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలికి మహోన్నత అవకాశం

వైఎస్సార్‌సీపీ తరఫున అరకు ఎంపీగా పోటీ చేసేందుకు వైద్యురాలు గుమ్మా తనుజారాణికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నత అవకాశం కల్పించారు. ఆమె ప్రస్తుతం పాడేరు ఐటీడీఏలోని ఐసీడీఎస్ పరిధి ఎపిడిమిక్ విభాగంలో వైద్యురాలిగా కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్నారు.

అరకులోయ టౌన్: అరకు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా గుమ్మా తనూజరాణి పేరును అధిష్టానం ప్రకటించడంతో అరకులోయలో శనివారం పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ కార్యాలయంలో థింసా నృత్యాలతో సందడి చేశారు. ర్యాలీగా వైఎస్ విగ్రహం వద్దకు వెళ్లి పూలమాల వేసి నివాళులర్పించారు. టికెట్ కేటాయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా తనూజరాణి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ అరకు పార్లమెంట్ పరిధిలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇస్తామన్నారు. గిరిజన ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఐదేళ్ల పాలనలో రూ.6కోట్లతో రహదారులు, 200 సెల్ టవర్లు నిర్మించిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. ఎంపీగా తనూజరాణి, ఎమ్మెల్యేగా రేగం మత్స్యలింగం విజయానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు లక్ష్మణకుమార్, స్వామి, మల్లేష్,, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సింహరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఎంపీపీలు ఉషారాణి, ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, మహిళా విభాగం అధ్యక్షురాలు సుమిత్ర,శాంతి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



పాడేరులో సంబరాలు జరుపుతున్న అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు

అభినందనలు తెలిపిన అరకు ఎమ్మెల్యే పాల్గుణ

వైఎస్సార్ సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగంను నివాసంలో స్థానిక ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అరకు,డుంబ్రిగుడ, అనంతగిరి ఎంపీపీలు ఈశ్వరి, ఉషారాణి, జెడ్పీటీసీ జానకమ్మ, పార్టీ మండల అధ్యక్షులు స్వామి, లక్ష్మణ్‌కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

రంపచోడవరం: రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థిగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి రెండోసారి టికెట్ కేటాయించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, ఎంపీపీ బందం శ్రీదేవి, సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర తదితరుల ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో టీడీపీని చిత్తు చేసి 40 వేల మోజారిటీతో గెలుపొందిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఈసారి లక్ష మోజారిటీతో విజయం సాధిస్తారని వారు పేర్కొన్నారు. ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ, బొబ్బా శేఖర్, నందూరి రాంబాబు, కొండ్రాజు,కాపారపు రూతు, చితుకులయ్యరెడ్డి, కైగాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సాటి గిరిజనులకు సేవ చేస్తా



గుమ్మా తనూజరాణి (అరకు పార్లమెంట్)
విద్యార్హత : ఎంబీబీఎస్ సామాజిక వర్గం : ఎస్టీ వాల్మీకి
పోటీ : తొలిసారి

సాక్షి,పాడేరు: సాటి గిరిజనులకు సేవ చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుమ్మా తనూజరాణి తెలిపారు. తనకు అవకాశం కల్పించిన సీఎంకు రుణపడి ఉంటానన్నారు. రాజకీయాలు తనకు కొత్త అయినప్పటికీ అరకు ఎంపీ స్థానానికి పోటీ చేసే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎస్టీ వాల్మీకి కులానికి తగిన గౌరవం ఇచ్చి తనను ఎంపిక చేయడం ఎంతో ఆనందాన్నిచ్చిందని ఆమె పేర్కొన్నారు.

ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి



నాగులపల్లి ధనలక్ష్మి : రంపచోడవరం అసెంబ్లీ
విద్యార్హత: ఎంఏ, బీఈడీ సామాజిక వర్గం: ఎస్టీ, కొండదొర
పోటీ: రెండోసారి (సిటింగ్ ఎమ్మెల్యే)

రంపచోడవరం: వైఎస్సార్ సీపీ రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థిగా మరోమారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవకాశమివ్వడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పేర్కొన్నారు. ఐదేళ్లలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి చేశామన్నారు. పోలవరం ప్రాజెక్టును పర్సంటేజీ ఇచ్చే ప్రాజెక్టుగా టీడీపీ ప్రభుత్వం మార్చేయగా, తాము నిర్వాసితులకు న్యాయం చేశామన్నారు.

మాట నిలబెట్టుకున్న జగనన్న



మత్స్యరాస విశ్వేశ్వరరాజు: పాడేరు అసెంబ్లీ
విద్యార్హత: ఎంఏ,ఎల్ఎల్‌బీ సామాజిక వర్గం: ఎస్టీ భగత
పోటీ: తొలిసారి

సాక్షి,పాడేరు: జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సమయంలోనే న్యాయం చేస్తానని మాట ఇచ్చారని ఈఎన్నికల్లో మాట నిలబెట్టుకున్నారని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు పేర్కొన్నారు. మాట ఇచ్చి మడమ తిప్పని మహోన్నత వ్యక్తిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం జరగదని తన విషయంలో రుజువైందన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం



రేగం మత్స్యలింగం (అరకు అసెంబ్లీ)
విద్యార్హత : ఎంఏ, టీఎంఐఆర్ అండ్ ఎల్‌డబ్ల్యూ
సామాజిక వర్గం : ఎస్టీ కొండదొర
పోటీ : అసెంబ్లీకి తొలిసారి (ప్రస్తుత హుకుంపేట జెడ్పీటీసీ)

అనంతగిరి: సామాజిక న్యాయం చేయడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సాటి లేరని వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. అన్ని కులాలకు ప్రాధాన్యమివ్వడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యపడిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమిచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన పక్షపాతిగా పేరొందారన్నారు. నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా పలు పథకాలు ప్రవేశపెట్టారని ఆయన పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అడ్డతీగల: జాతీయ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం, వై.రామవరం మండలాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుంది. ఈ విషయాన్ని రంపచోడవరం డివిజన్ ట్రాన్స్‌కో ఈఈ యూసఫ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సమస్యను గుర్తించి సహకరించాలని ఆయన కోరారు.

అయోధ్యకు పాదయాత్ర



అయోధ్యకు బయలుదేరిన శ్రీరామనంద స్వామిజీ

జి.మాడుగుల: చింతపల్లి మండలం కృష్ణాపురం శ్రీ పాకలపాటి గురుదేవుల ఆశ్రమ ప్రతినిధి శ్రీ రామనంద స్వామిజీ అయోధ్యకు చేపట్టిన పాదయాత్ర శనివారం జి.మాడుగుల చేరింది. కృష్ణాపురంలో ప్రారంభమైన ఈయాత్ర సుమారు 1200 కిలోమీటర్ల మేర చిత్రపుట్టు, పాడువ, జైపూర్, నౌరంగపూర్, డొంగరిపరా, సాన్‌పూర్, రాయ్‌పూర్, బేమ్‌తారా, పండరాయా, ఘదా సరై, షడోల్, బోహరి, గూడ్,మనగోవా, ప్రయాగరాజ్, ప్రతాప్‌ఘర్, సుల్తాన్‌పూర్ మీదుగా అయోధ్య చేరుకుంటుందని ఆయన తెలిపారు. శ్రీ పాకలపాటి గురుదేవులు భక్త సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మత్స్యరాస మత్స్యరాజు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బంది లేకుండా చర్యలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్వో అభిషేక్

పెదబయలు: ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని అరకు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. శనివారం మండలంలో పర్యటించిన ఆయన పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. దీనిలో భాగంగా గంపరాయి, గలగండ పంచాయతీల పరిధిలోని గసాబు, గంపరాయి, పెదకోడాపల్లి పంచాయతీ పరదానిపుట్టు, పెదకోడాపల్లి కేంద్రాలను సందర్శించారు.

మోగిన ఎన్నికల నగరా

సమరానికి ముహూర్తం ఖరారు



సాక్షి, పాడేరు : సార్వత్రిక ఎన్నికల నగరా మోగింది. పార్లమెంటుతో పాటు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం శనివారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఏడు విడతల్లో ఎన్నికలు జరగనుండగా ఈసారి నాలుగో విడతలో ఏపీలో పార్లమెంటు స్థానాలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుందని అధికారవర్గాలు తెలిపాయి.

నోటిఫికేషన్	: ఏప్రిల్ 18వ తేదీ
నామినేషన్ల స్వీకరణ	: 18 నుంచి ఏప్రిల్ 25
నామినేషన్ల పరిశీలన	: ఏప్రిల్ 26 నుంచి
ఉపసంహరణ	: ఏప్రిల్ 29
పోలింగ్ తేదీ	: మే 13
ఓట్ల లెక్కింపు	: జూన్ 04వ తేదీ

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు	1051
మొత్తం ఓటర్లు	7,60,748
పురుషులు	3,68,055
మహిళలు	3,92,655
ఇతరులు	38

మార్చి 16 నాటికి ఓటర్ల వివరాలు (నియోజకవర్గాల వారీగా)

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	థర్డ్	మొత్తం
అరకు వ్యాలీ	1,18,304	1,24,840	7	2,43,151
పాడేరు	1,18,979	1,27,632	16	2,46,627
రంపచోడవరం	1,30,772	1,40,183	15	2,73,970

బీజేపీకి టికెట్ కేటాయిస్తే ఓడిస్తాం

- టీడీపీ అధిష్టానానికి గిడ్డి ఈశ్వరి అనుచరుల హెచ్చరిక
- పాడేరులో భారీగా నిరసన ర్యాలీ

పాడేరు: పొత్తులో భాగంగా పాడేరు అసెంబ్లీ టికెట్‌ను బీజేపీకి కేటాయించనున్న నేపథ్యంలో టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. నిర్ణయం మార్చుకోకుంటే ఓడించి తీరుతామని హెచ్చరించాయి. పాడేరు అసెంబ్లీ టికెట్ పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయింపు దాదాపు ఖాయమైంది. ఈ నిర్ణయం పాడేరు అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరికి షాక్ ఇచ్చినట్టయింది. దీంతో ఈ నెల 14న నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన అనుచరులు, టీడీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించిన ఆమె అందరి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తమ సత్తా నిరూపించేందుకు బల ప్రదర్శన చేయాలని వారు నిర్ణయించారు. దీనిలో భాగంగానే శనివారం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన గిడ్డి ఈశ్వరి అనుచరులు కుమ్మరిపుట్టులోని ఆమె నివాసం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, సినిమా హాల్ సెంటర్, పాత బస్టాండ్, మెయిన్ బజారు, సాయి బాబా ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలో ఏమాత్రం ఉనికి లేని బీజేపీకి టికెట్ ఎలా కేటాయిస్తారని నినాదాలు చేశారు. నిర్ణయం మారకుంటే బీజేపీ అభ్యర్థిని ఓడించి తీరుతామని హెచ్చరించారు.



పాడేరులో ర్యాలీ నిర్వహిస్తున్న గిడ్డి అనుచరులు

పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

- హాజరుకానున్న 12,051 మంది విద్యార్థులు
- కలెక్టర్ విజయ సునీత

8లో

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగానికి చర్యలు

● అరకు అసెంబ్లీ ఆర్వో అభిషేక్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అరకు అసెంబ్లీ ఆర్వో అభిషేక్

పాడేరు: బలమైన ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అరకు అసెంబ్లీ ఆర్వో, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు వినియోగంపై ఎన్నికల కమిషన్ రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధ్యత గల పౌరులుగా ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్‌శర్మ, డీటీ అప్పలస్వామి, టీఎంయూ పోగ్రాం అధికారి రామ్‌గోపాల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నాటు తుపాకీలు అప్పగింత

● ప్రోత్సాహక నగదు అందజేసిన పోలీసులు

గూడెంకొత్తవీధి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఎస్పీ తుహిన్‌సిన్హా, చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్‌శివ కిషోర్ లైసెన్సు లేని తుపాకులతో పాటు నాటు తుపాకులు ఉంటే సమీప పోలీస స్టేషన్‌లో అప్పగించాలని పిలుపునిచ్చారు. దీనిపై స్పందించిన గిరిజనులు శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ముగ్గురు గిరిజనులు మూడు నాటు తుపాకులను స్వచ్ఛందంగా తీసుకువచ్చి అప్పగించారు. వారిని అభినందించిన సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి ప్రోత్సాహకంగా కొంత నగదు అందించి పంపించారు. మిగిలిన వారు కూడా అప్పగించాలని వారు కోరారు. తనిఖీల్లో పట్టుబడితే అక్రమ ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



ఎల్లవరం పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



రాజవొమ్మంగి పీహెచ్‌సీలో చార్ట్‌లో వివరాలను పరిశీలిస్తున్న పీవో సూరజ్‌గనోరే

● ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే
● పీహెచ్‌సీల్లో తనిఖీలు

అడ్డతీగల: మండలంలోని ఎల్లవరం పీహెచ్‌సీని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే శనివారం ఆకస్మికంగా సందర్శించారు. వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిధిలో గ్రామాలు, ఓపీ కేసులు, సిబ్బంది వివరాలను సిబ్బందిని అడిగారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఆస్పత్రిలో జరుగుతున్న ప్రసవాల గురించి ఆరా తీశారు. రోగులకు త్వరితగతిన వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయాలన్నారు. సీజనల్ వ్యాధులకు మందులు పంపిణీ చేయాలని సూచించారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ జి.ప్రకాశం, వైద్యాధికారులు ఉన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి, రాజవొమ్మంగి, లాగరాయి పీహెచ్‌సీలను రంపచోడవరం ఐటీడీఏ పీఓ సూరజ్ గనోరే శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జడ్డంగిలో సిబ్బంది, ఎంఎన్‌ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పలువురు పీఓ దృష్టికి తీసుకొని రావడంతో ఎల్లవరంలో పనిచేస్తున్న కంచెం పాపను (ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ) వెంటనే జడ్డంగి పీహెచ్‌సీకు నియమించారు. ఆయా పీహెచ్‌సీల్లో వార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలోని ఏర్పాటుచేసిన చార్ట్‌ల గురించి వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు యామినిప్రియ, నాగార్జున, సుష్మాలకు పలు సూచనలిచ్చారు. అనంతరం స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి పది పరీక్షలు రాస్తున్న విద్యార్థినులతో మాట్లాడారు. ఒత్తిడికి లోను కాకుండా నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా పరీక్షలు రాయాలని సూచించారు. ఆయన వెంట ఏటీడబ్ల్యూవో టి.రమేష్ పాల్గొన్నారు. లాగరాయిలో గోకులం నిర్మాణ పనులను పరిశీలించారు.

పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

రేపటి నుంచి 65 కేంద్రాల్లో నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

సాక్షి,పాడేరు: టెన్త్ పరీక్షలు ఈనెల 18నుంచి 30 వరకు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఎం.విజయసునీత తెలిపారు. శనివారం తన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లాలోని 22 మండలాల్లో ఏర్పాటుచేసిన 65 కేంద్రాల్లో 12,051మంది విద్యార్థులు పరీక్ష రాస్తారని తెలిపారు. వీరిలో రెగ్యులర్ 10,986 మంది, ప్రైవేట్ 1065 మంది విద్యార్థులు ఉన్నారన్నారు.ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలకు సంబంధించి ఏ కేటగిరిలో 16,బీ కేటగిరిలో 38, సీ కేటగిరిలో 11 ఉన్నాయని, అన్ని చోట్ల పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించామని ఆమె తెలిపారు. స్టోరేజీ కోసం 22 పోలీసు స్టేషన్ పాయింట్లను గుర్తించామని, 65 పరీక్షా కేంద్రాలకు 65మంది చీఫ్ సూపరింటెండెంట్లు,65 డిపార్ట్‌మెంట్ అధికారులు,10 రూట్లకు సంబంధించి నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని కలెక్టర్ తెలిపారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు

ఈనెల 18వతేది నుంచి 27 వరకు టెన్త్, ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ విజయ సునీత తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో టెన్త్‌కు సంబంధించి 1792 మంది, ఇంటర్‌లో 2,189 మంది మొత్తం 3,981మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు.ప్రతిరోజు మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 30 నుంచి ఏప్రిల్ 3వతేదీవరకు జరుగుతాయన్నారు. టెన్త్‌కు పాడేరు డివిజన్‌లో 6, రంపచోడవరం డివిజన్‌లో 3, ఇంటర్‌కు పాడేరు డివిజన్‌లో 4, రంపచోడవరం డివిజన్‌లో ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆమె వెల్లడించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ రావు, డీడీ కొండలరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల సందడి



అరకులోయలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజారాణి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నేతలు



విశ్వేశ్వరరాజును అభినందిస్తున్న జీకే వీధి నాయకులు



రంపచోడవరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సాక్షి, పాడేరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అల్లూరి జిల్లాకు చెందిన అరకులోయ, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ నుంచి పోటీచేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల వివరాలను పార్టీ అధిష్టానం శనివారం ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లాలో అరకులోయ, పాడేరు, ముంచంగిపుట్టు, హుకుంపేట, పెదబయలు, కొయ్యూరు, గూడెం కొత్తవీధిలో పార్టీ శ్రేణులు సందడి చేశారు. బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంచిపెట్టారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, అరకు, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థులు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శిగా చిన్నారావు

విశాఖ సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ విభాగ ప్రధాన కార్యదర్శిగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పంగి చిన్నారావు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాన్ని చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

'బర్డ్ సర్వే ఏపీ వాచర్స్ మీట్' ప్రారంభం



బ్రోచర్లను పంపిణీ చేస్తున్న డీఎఫ్‌వో నరేందరన్ తదితరులు

మారేడుమిల్లి : పాపికొండలు నేషనల్ పార్క్ బర్డ్ సర్వే ఏపీ వాచర్స్ మీట్- 2024ను శనివారం అటవీశాఖ అధికారులు స్థానిక జంగిల్ స్టార్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో నరేందరన్ మాట్లాడుతూ భారతదేశంలో కనిపించే 1300 పక్షి జాతుల్లో 470 మన రాష్ట్రంలోనే ఉన్నాయన్నారు. పాపికొండలు జాతీయ ఉద్యానవనం పరిధి రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో 300కు పైగా పక్షి జాతులు ఉన్నట్టు రికార్డులు ఉన్నాయన్నారు. పక్షులను గుర్తించే వివిధ పద్ధతులను వివరించారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా పక్షుల సర్వే, పరిశీలకులతో సమావేశం నిర్వహించడం ఇదే ప్రథమమన్నారు. మూడు రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం పక్షులు, వాటి వివరాలు తెలిపే బ్రోచర్లను అధికారులు, సిబ్బందికి పంపిణీ చేశారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, ప్రముఖ పక్షి పరిశీలకులు శాంత కుమార్, మృత్యుంజయరావు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.